www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 24 ఫిబ్రవరి 2024
5
తిరుపతి



వృత్తిధర్మానికి వన్నెతెచ్చిన జన్నత్ హుస్సేన్

ప్రజాశక్తి - సూళ్లూరుపేట

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో (ఫైల్)

నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం. వృత్తిధర్మానికి వన్నెతెచ్చిన గొప్ప వ్యక్తి జన్నత్ హుస్సేన్. గత కొన్ని రోజులుగా అల్జీమర్స్ వ్యాధితో బాధపడుతూ శుక్రవారం ఉదయం సూళ్లూరుపేటలోని తన స్వగృహంలో మృతిచెందారు. శనివారం సాయంత్రం హైదరాబాద్ పంజాగుట్ట శ్మశానవాటికలో అంత్యక్రియలు జరపనున్నట్లు కుటుంబీకులు తెలిపారు. జన్నత్ హుస్సేన్ 1977 ఐఎఎస్ బ్యాచ్. ఉమ్మడి ఏపీలో నారా చంద్రబాబునాయుడు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డిలు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రానికి చీఫ్ సెక్రటరీగా పనిచేశారు. 2010, డిసెంబర్ 31న ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో రిటైర్ అయ్యారు.

ఎపి టూరిజంలోకి 'ప్రైవేట్' బస్సులు

15 ఎలక్ట్రికల్ బస్సుల కొనుగోలుకు టెండర్లు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఎపి టూరిజంలోకి ప్రైవేట్ బస్సులు ప్రవేశిస్తున్నాయి. 15 ఎలక్ట్రికల్ బస్సుల కొనుగోలుకు టెండర్లను ఆహ్వానించారు. త్వరలోనే ఈ బస్సులూ రోడ్డెక్కనున్నాయి. తిరుపతి డివిజన్‌లో 15 బస్సులు లోకల్, నాన్ లోకల్‌గా ఎపి టూరిజం బస్సులు నడుస్తున్నాయి. ఇందులో డ్రైవర్లు, క్లీనర్లు, గ్యారేజి మెకానిక్‌లు మొత్తం 150 మంది పనిచేస్తున్నారు. 'నీగో' సంస్థకు చెందిన 15 ఎలక్ట్రికల్ బస్సులను కొనుగోలు చేసేందుకు టెండర్లకు ఆహ్వానించారు. ఎపి టూరిజం నేరుగా 'నీగో' కంపెనీతో ఒప్పందం కుదుర్చుకోలేదు. పలమనేరుకు చెందిన కళాధర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. మూడో వ్యక్తితో ఒప్పందం కుదిరింది. భవిష్యత్‌లో మరో 15 బస్సులను ప్రైవేట్‌కు అప్పగించనున్నారు. అదే జరిగితే ప్రస్తుతం పనిచేస్తున్న 150 మంది కార్మికులు ఇంటి బాట పట్టాల్సిందే.

ఎపి టూరిజం తిరుపతి డివిజన్ రాష్ట్రంలోనే అత్యంత ఆదాయం ఉన్న సంస్థ. దాదాపు 15 వోల్వా బస్సులు తిరుపతి - చెన్నయ్, తిరుపతి - బెంగుళూరు, తిరుపతి - హైదరాబాద్, తిరుపతి- విజయవాడ మధ్య నడుస్తున్నాయి. డ్రైవర్లు, క్లీనర్లు, గ్యారేజి మెకానిక్‌లు మొత్తం కలిపి 150 మంది గత 30 ఏళ్లుగా పనిచేస్తున్నారు. ఎవరినీ పర్మినెంట్ చేయలేదు. వీరంతా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. తిరుమల - తిరుపతి, కాణిపాకం- శ్రీకాళహస్తి, తిరుచానూరు - తలకోన, హార్సిలీహిల్స్, అప్పలాయగుంట, నారాయణవనం, నాగలాపురం, సురుటుపల్లి, ముక్కోటి తదితర ప్రాంతాల్లో బస్సులు నడుస్తాయి. ఐదు బస్సులు తప్ప మిగిలిన పది బస్సులు వోల్వా బస్సులే. స్పెషల్ దర్శనం బుక్ చేసుకున్న అందరూ ఈ బస్సుల్లోనే దర్శనానికి వెళతారు. ఎపి టూరిజం గైడ్లు ఈ బస్సుల్లో అందుబాటులో ఉంటారు. టిటిడికి, ఎపి టూరిజంకు ఒప్పందంలో భాగంగానే ఈ దర్శనాలు నడుస్తాయి. తిరుమలలో మూడు టూరిజం హోటల్స్ ఈ మధ్యకాలంలో అందుబాటులోకి వచ్చాయి. ఆదాయం పెరగడంతో యాత్రికుల రద్దీ ఉండడంతో 'ప్రైవేట్' బస్సులు ఎపి టూరిజంలోకి ప్రవేశించే ఆలోచన జరిగింది. తాజాగా ఎలక్ట్రికల్ బస్సులు రావడంతో నీగో సంస్థకు చెందిన ఎలక్ట్రికల్ బస్సులకు టెండర్లను ఆహ్వానించారు. నేరుగా ఆ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకోకుండా మధ్యేమార్గంగా పలమనేరుకు చెందిన కళాధర్‌తో ఒప్పందం కుదిరింది. ఒక టూరిజం వోల్వా బస్సులు ఇద్దరు డ్రైవర్లు, ఒక గైడ్, ఒక క్లీనర్ ఉంటారు. ఈ ఎలక్ట్రికల్ బస్సుల్లో ఒకే డ్రైవర్‌తో నడవనున్నాయి. గ్యారేజి సైతం ప్రైవేట్ వ్యక్తుల వద్దనే ఉంటుంది. ఏది ఏమైనప్పటికీ ఈ 'ప్రైవేట్' ఎలక్ట్రికల్ బస్సులు ప్రవేశిస్తే 'ఎపి టూరిజం' బస్సులు ఇంటి దారి పట్టక తప్పదన్న చర్చ నడుస్తోంది.

ఒక్కరినీ తొలగించం : గిరిధర్‌రెడ్డి, డివిజన్ మేనేజర్

ప్రైవేట్, ఎలక్ట్రికల్ బస్సులను ఆహ్వానించిన మాట వాస్తవమే. త్వరలోనే ఈ బస్సులు ఎపి టూరిజంలోకి రానున్నాయి. ప్రస్తుతం ఉన్న బస్సులను తొలగించి రవాణా వ్యవస్థ మొత్తం 'ప్రైవేట్'కు ఇవ్వబోం. ఒక్కరినీ తొలగించే ప్రసక్తే లేదు. ఎలక్ట్రికల్ బస్సులు లోకల్, నాన్ లోకల్‌గా తిరగనున్నాయి. ప్రస్తుతం ఎపి టూరిజం పరిధిలో ఉన్న బస్సులు రన్నింగ్‌లో ఉంటాయి. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు.

రైతు హంతకుడు మోడీ

నల్ల చట్టాల రద్దుకై నిరసన ర్యాలీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి, తిరుపతి టౌన్, గూడూరు టౌన్

దేశానికి అన్నం పెట్టే అన్నదాతల పాలిట నరేంద్ర మోడీ హంతకుడిలా మారాడని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య విమర్శించారు. ఢిల్లీ- హర్యానా సరిహద్దుల్లో నల్ల చట్టాల రద్దుకు ఉద్యమించిన ఓ యువ రైతును పోలీసులు తమ కాల్పుల ద్వారా పొట్టన పెట్టుకోవడంపై శుక్రవారం నిరసన ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ సర్కిల్ వద్దకు చేరుకుని మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నల్ల చట్టాలు రద్దు చేయాలని గత ఏడాది రైతులు ఢిల్లీలో ఉద్యమం చేస్తే వందల మంది అన్నదాతలు అశువులు బాసారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి త్యాగాల ఫలితంగా నల్ల చట్టాలను రద్దు చేస్తామని పార్లమెంట్ సాక్షిగా ప్రకటన చేసిన కేంద్రం తిరిగి ఏడాది గడుస్తున్నా అమలు చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఫలితంగా మరోమారు రైతులు ఢిల్లీ బాట పట్టాల్సి వచ్చిందనీ, ఈ క్రమంలో హర్యాణా బోర్డర్ లో పోలీసులు జరిపిన కాల్పుల్లో ఓ యువ రైతు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. రైతుల మతికి మోడీనే బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్రం దిగొచ్చి మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేస్తూ పంటలకు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకుంటే మోడీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో బంగాళాఖాతంలో కలిపేస్తామని హెచ్చరించారు. పట్టణ బాధ్యుడు గంధం మణి, నాయకులు పెనగడం గురవయ్య, వేణు, సంక్రాంతి వెంకటయ్య, ఈశ్వరయ్య ,వెలివేంద్రం, ఉస్మాన్ బాషా, గురునాథం, రాజా తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు తిరుపతి నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ అధ్యక్షతన నిరసన జరిగింది. ఉపాధ్యక్షులు టి.సుబ్రమణ్యం మాట్లాడుతూ పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఎరువులు, విత్తనాలు సబ్సిడీకి అందించాలని, వ్యవసాయానికి రుణాలు ఇవ్వాలని సుదీర్ఘకాలం పోరాటం చేసిన సందర్భంగా 700 మంది అమరులయ్యారన్నారు. అప్పట్లో తప్పనిసరి పరిస్థితుల్లో మోడీ దిగి వచ్చి నల్లచట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారని, అయితే అమలుకు నోచుకోలేదన్నారు. అన్నదాతలపై మోడీ దాష్టీకాన్ని నిరసిస్తూ నిరసన చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.బుజ్జి, రఘు, రమేష్, ఎన్.మాధవి, మునిరాజా, పార్ధసారథి, రాధాక్రిష్ణ, వాసు, శ్రీరాములు, భగత్ రవి, అక్బర్, రవి పాల్గొన్నారు.

గూడూరు టౌన్‌లో టవర్‌క్లాక్ సెంటర్ వద్ద నిరసన తెలిపారు. రైతుసంఘం నాయకులు జోగి శివకుమార్ మాట్లాడుతూ కనీస మద్దతు ధర కోసం దేశవ్యాప్తంగా రైతుల పోరాటాలు తీవ్ర స్థాయిలో జరుగుతున్నాయన్నారు. పోలీసు కాల్పుల్లో 21 సంవత్సరాల యువరైతు శుభకరన్ సింగ్ మృతిచెందారన్నారు. ఈ మృతులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. నాయకులు బివి రమణయ్య, ఎన్.సురేష్, టి.వెంకటరామిరెడ్డి, అడపాల ప్రసాద్, బి.రమేష్ పాల్గొన్నారు.

రేపు గ్రూప్ 2 పరీక్షలు

ఉదయం 10.30- 1 గంట వరకూ

మొత్తం 27,961 మంది అభ్యర్థులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఈనెల 25న ఆదివారం నిర్వహించే గ్రూప్ 2 పరీక్షల్లో ఎలాంటి చిన్న పొరబాట్లు జరగకుండా విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మిశ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డిఆర్ఒ పెంచల కిషోర్, విభాగం అడిషనల్ సెక్రటరీ వెంకటలక్ష్మితో కలిసి సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్ 2 పరీక్ష ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ ద్వారా జరుగుతుందన్నారు. తిరుపతి జిల్లాలో తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట, శ్రీకాళహస్తి, పుత్తూరు, కోట, గూడూరు మండల కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 61 సెంటర్లలో 27,894 మంది గ్రూప్ 2 పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. 31 మంది రూట్ ఆఫీసర్లుగాను, 61 మంది తహశీల్దార్లు, ఎంపిడిఒలను లయిజాన్ ఆఫీసర్లుగానూ, 61 చీఫ్ సూపరింటెండెంట్లను ఆయా కళాశాల ప్రిన్సిపాల్స్‌ను నియమించడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాలకు హాల్‌టిక్కెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు.

రాగులు పోయే... పిండి వచ్చే..!

- తెల్లకార్డుదారులకు కిలో రూ.11కే
- తొలి విడతగా రాయలసీమ, ఉత్తరాంధ్రల్లో

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

వచ్చే నెల 1 నుంచి రేషన్ లబ్దిదారులకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ రాగిపిండిని పంపిణీ చేయనుంది. ముందుగా వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో బలవర్ధక ఆహారంగా రాగిపిండిని కేజీ ప్యాకెట్ల రూపంలో సరఫరా చేయాలని నిర్ణయించింది. బహిరంగ మార్కెట్లో కిలో రాగిపిండి రూ.40 పైమాటే. అయితే లబ్దిదారులకు కిలో రూ.11కే ఇవ్వనుంది. తొలుత శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, మన్యం. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖపట్నం, రాయలసీమలోని అన్నమయ్య, అసం తపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, తిరుపతి, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఒక్కో కార్డుకు ప్రస్తుతం ఇస్తున్న బియ్యంలో రాగులు, జొన్నలు ఈ క్రమంలోనే కార్డుదారులు వాటిని మిల్లింగ్.చేసుకుని వినియోగించుకుంటున్నారు. ఇకపై లబ్ధి దారులకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా తొలిసారిగా రాగిపిండి పంపిణీకి శ్రీకారం చుడుతోంది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 11 లక్షల మందికి లబ్ధి

రాష్ట్ర ప్రభుత్వం వచ్చే నెల నుంచి కిలో రాగి పిండి ఇవ్వడం వల్ల ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 11 లక్షల 45 వేల మంది కార్డు దారులకు లబ్ది చేకూరనుంది. చిత్తూరు జిల్లాలో రాగి పిండి అధికంగా వినియోగిస్తారు. మార్చి నెల వేసవికాలం కావడంతో రాగి వినియోగం అధికంగా ఉంటుంది. రాగులు, జొన్నలు, సజ్జలకు మద్దతు ధర ప్రకటించి, రైతు భరోసా కేంద్రాల ద్వారా సేకరించేందుకు ప్రణాళికలు రూపొందించింది. 20వేల టన్నుల జొన్నలను సేకరించనుంది. అలాగే గోధుమ పిండినీ రూ.16కే అందిస్తోంది.

చిత్తశుద్ధి లేని నిర్ణయాలతో పౌరసరఫరాల శాఖ అభాసుపాలవుతోంది.. గతంలో మార్క్‌ఫెడ్ ద్వారా అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసి కార్డుదారులకు అందిస్తామని వెల్లడించింది. అయితే వస్తువులు నాశిరకంగా ఉండడంతో ఎవరూ కొనుగోలు చేయకపోవడంతో దుకాణం మూసేసింది. ఐదారు నెలల క్రితం కిలో రాగులను బియ్యంకు బదులు ఇస్తామని ప్రకటించింది. అయితే రాళ్లు, రాగులు కలిసిపోయి మహిళలు ఎవరూ కొనుగోలు చేయడానికి ముందుకు రాలేదు. దీంతో వెనకడుగు వేసింది. ప్రస్తుతం రాగి పిండిని కిలో 11కే ఇస్తామని, తొలివిడతగా రాయలసీమ, ఉత్తరాంధ్రలో పంపిణీ చేసేందుకు శ్రీకారం చుడుతోంది. ఏదిఏమైనా నాణ్యత లేని వస్తువులను కొనుగోలు చేయడానికి కార్డుదారులు ముందుకు రావడం లేదు. నాణ్యత వున్న వస్తువులు చివరి వరకూ డీలర్లు పంపిణీ చేయడం లేదన్న విమర్శలున్నాయి.

26న కల్యాణకట్ట క్షురకుల ధర్నా

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుమల కల్యాణకట్టలో దశాబ్దకాలానికి పైగా పనిచేస్తున్న క్షురకులకు వేతనాలు పెంచకుండా టిటిడి యాజమాన్యం ఇబ్బంది పెట్టడం సమంజసం కాదని శ్రీవారి కల్యాణకట్ట క్షురకుల యూనియన్ గౌరవాధ్యక్షులు కందారపు మురళి అన్నారు. 24న కరపత్రాల ఆవిష్కరణ, 25న రౌండ్‌టేబుల్ సమావేశం, 26న టిటిడి పరిపాలనా భవనం ముందు భారీ ధర్నా చేపడతామని వెల్లడించారు. శుక్రవారం యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ 850 మంది పీస్‌రేట్ కార్మికులుగా పనిచేస్తున్న క్షురకులలో కేవలం 18 మందికి మాత్రమే వేతనాలు పెంచారన్నారు. ఈ 18 మంది లక్ష్మీ శ్రీనివాసా కార్పొరేషన్‌లో ఉండటమే కారణమన్నారు. మిగిలిన 800 మంది క్షురకులు తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేయమని కోరుతూ కోర్టుకు వెళ్లిన కారణంగా వేతనాలు పెంచడం లేదని, ధార్మిక సంస్థ ఇలా నిర్ణయించడం ధర్మమేనా అని ప్రశ్నించారు. టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి పీస్‌రేట్ క్షురకులకు వేతనాలు పెంచుతామని, వందల కుటుంబాలకు న్యాయం జరుగుతుందని ప్రకటించి, కేవలం 18 మందికి మాత్రమే పెంచడంలో ఔచిత్యం ఏంటని ప్రశ్నించారు. గతంలో కెఒడి (కెప్ట్ ఆన్ డ్యూటీ) పేరిట వేధింపులకు పాల్పడి క్షురకులను తొలగించిందని, ఛైర్మన్ జోక్యంతో తొలగించిన వారిని పనిలోకి తీసుకున్నారని గుర్తుచేశారు. కెవొడి విధానాన్ని శాశ్వతంగా తొలగించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు శ్రీహరి, ప్రసాద్‌లను తప్పుడు ఆరోపణలతో తొలగించారన్నారు. క్షురకులకు బస్సుపాసులు నిలిపేశారన్నాఉ. బ్రహ్మోత్సవ బహుమానం ఇవ్వడం లేదన్నాఉ. కేశాల ద్వారా రూ.250 కోట్లు ఆర్జిస్తున్న టిటిడి క్షురకుల ఆరోగ్య పరిరక్షణ గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి క్షౌరవృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.గంగులప్ప, యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.శ్రీహరి, జి.ప్రసాద్ పాల్గొన్నారు.

నారా భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న ఆదిమూలం

టిడిపి శ్రేణులను ఆదుకుంటాం..!

ముగిసిన నారా భువనేశ్వరి పర్యటన

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్, యంత్రాంగం

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' నాలుగు రోజుల పర్యటన శుక్రవారం ముగిసింది. కుప్పం, పలమనేరు, పుంగనూరు, పూతలపట్టు, చిత్తూరు, జీడీనెల్లూరు, సత్యవేడు నియోజకవర్గాల్లో 15 మంది కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి, ఒక్కో కుటుంబానికి మూడు లక్షల చొప్పున చెక్కును అందజేశారు. టిడిపి శ్రేణులకు అండగా ఉంటామని భరనోసా ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం సత్యవేడు నియోజకవర్గంలో పర్యటన ముగించుకుని రేణిగుంట విమానాశ్రయం చేరుకుని హైదరాబాద్‌కు వెళ్లనున్నారు. శుక్రవారం ఉదయం కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ది వినాయకస్వామిని దర్శించుకున్నారు. కార్వేటినగరంలో వేణుగోపాలస్వామి ఆర్చి దగ్గర నారా చంద్రబాబునాయుని ఆరడుగుల కటౌట్ దగ్గర ఆమెకు స్వాగతం పలికారు. ఎన్టీఆర్ కుమార్తె భువనేశ్వరి జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. టిడిపి అధ్యక్షులు జగన్నాథం,రాజేంద్రరెడ్డి, దాసరి గణేష్ పాల్గొన్నారు. ఎస్ఆర్‌పురంలో గంగాధర నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ థామస్ స్వాగతం పలికారు. సత్యవేడు నియోజకవర్గం నారాయణవనం వద్ద సిట్టింగ్ ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి, పనబాక లక్ష్మి, భానుప్రకాష్, నాని, చిట్టిబాబునాయుడు పాల్గొన్నారు.

మెడకు ఉరితాళ్లతో వినూత్న నిరసన

ప్రజాశక్తి - క్యాంపస్

ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఒప్పంద సేవల వర్కర్లకు కనీస వేతనం పెంచాలని కోరుతూ అగ్రికల్చర్ కళాశాల వర్కర్స్ యూనియన్ (సిఐటియు)ఆధ్వర్యంలో నడిరోడ్డులో మెడకు ఉరితాళ్లు బిగించుకొని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. 'మా చావుతోనైనా జగన్మోహన్ రెడ్డికి కళ్ళు తెరిపించాలి.. మా సమస్య పరిష్కరించాలి' అని నినాదాలు చేశారు. సిఐటియు జిల్లా నాయకులు ఎస్ జయ చంద్ర, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.సాయిలక్ష్మి, రాష్ట్ర కోశాధికారి జి.నాగ వెంకటేష్, అంగన్వాడి యూనియన్ రాష్ట్ర కోశాధికారి వాణిశ్రీ, శ్రామిక మహిళా కన్వీనర్ ఆర్ లక్ష్మి మాట్లాడుతూ యూనివర్సిటీ యాజమాన్యం చర్చల పేరుతో కాలయాపన చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వ అధికారులు జీవో ఇచ్చినప్పటికీ యూనివర్సిటీ యాజమాన్యం అమలు జరపడం లేదన్నారు. టైం స్కేల్ వర్కర్లకు గుర్తించాలని కోరారు. యూనియన్ నాయకులు వరలక్ష్మి , చంద్రమ్మ సుబ్బు, ముని లక్ష్మి, రాధా ,గిరి రేవతి, నాగరాజు పాల్గొన్నారు.

స్మగ్లర్ల ఘాతుకం..?

బారికేడ్లను ఢీకొన్న వాహనం పిసి ప్రభాకర్‌రావు కోమాలోకి..

ప్రజాశక్తి-తిరుపతి బ్యూరో

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ

ఎర్రచందనం స్మగ్లర్లు టాస్క్‌ఫోర్స్ నుంచి తప్పించుకునేందుకు ఘాతుకానికి తెగబడ్డారు. వెంకటగిరి ఏర్పేడు మార్గంలోని చింతలపాలెం చెక్ పోస్ట్ మార్గంలో ఎర్రచందనం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో తిరుపతి టాస్క్ ఫోర్స్ కేంద్ర కార్యాలయం నుండి వాహనాలు తనిఖీ చేపట్టడానికి టాస్క్ ఫోర్స్ బందం బయలుదేరింది. శుక్రవారం తెల్లవారుజామున టాస్క్ ఫోర్స్ బందంలోని ఏఆర్ పిసి(పిసి నంబర్ 3057) ప్రభాకర్ రావు వేగంగా వస్తున్న స్మగ్లర్ల వాహనాన్ని అడ్డుకోవడానికి రోడ్డుకు అడ్డంగా బారికెడ్లను ఉంచారు. గమనించిన స్మగ్లర్ల వాహనం వేగంగా బారికేడ్‌లను ఢీకొనింది. ఈ ఘటనలో బారికేడుకున్న ఇనుప కడ్డీ పిసి ప్రభాకర్ రావు తలకు బలంగా తగలడంతో అతను కోమాలోకి వెళ్లిపోయాడు. ఈ హఠాత్ పరిణామంతో తేరుకున్న సిబ్బంది వెంటనే ప్రభాకర్ రావును దగ్గరలోని అమర హాస్పిటల్లో అడ్మిట్ చేశారు. ప్రభాకర్ రావు ఆరోగ్యం ఆందోళనకరంగా ఉండడంతో వెంటనే వైద్యులు సర్జరీ చేయాలని సూచించారు. ప్రస్తుతం వైద్యులు ప్రభాకర్ రావుకు సర్జరీ చేశారు. అతని ఆరోగ్య పరిస్థితి మాత్రం ఆందోళనకరంగా ఉన్నట్టుగా తెలుస్తోంది. విజయనగరం జిల్లాకు చెందిన ప్రభాకర్ రావు కడప ఏఆర్ కు ఎంపికయ్యారు. అక్కడి నుండి తిరుపతి రెడ్ శాండిల్ టాస్క్ ఫోర్స్ కు బదిలీపై వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. ప్రభాకర్ రావు ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో తోటి సిబ్బంది చందాలు వేసి మరొక ఆపరేషన్ చేయించడానికి ఇతర సిబ్బందిని సహాయం కోరినట్టుగా సమాచారం.టాస్క్‌ఫోర్స్ ఆర్ఎస్ఐ వినోద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏర్పేడు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

రచయిత యతిరాజులు ఆదర్శం : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

సామాజిక స్పృహ కలిగిన రచయితలలో యతిరాజులు ఆదర్శమని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అన్నారు. యతిరాజులు ఏడో వర్థంతిని యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వందవాసి నాగరాజు మాట్లాడుతూ యతిరాజులు రచయితగానే కాకుండా, అనేక భాషల్లో అనువాదం చేశారన్నారు. ఆయన సేవలను తమిళనాడు ప్రభుత్వం గుర్తించి పురస్కారాలు అందజేసిందన్నారు. కొంతమంది రచయితలు ఆర్థిక ప్రయోజనాల కోసమే రచనలు చేసేవారని, యతిరాజులు తన రచనలతో అభ్యుదయ భావాలను ప్రజల్లోకి తీసుకెళ్లేవారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, నాయకులు టి.సుబ్రమణ్యం, మాధవ్, చంద్రశేఖర్, రాధాక్రిష్ణ, రామకృష్ణ, ఎన్‌డి శ్రీను, బుజ్జి, రవి, అక్బర్ పాల్గొన్నారు.

అక్కను స్కూలు వ్యాను ఎక్కించడానికి వచ్చి...

చిన్నారి సాత్విక మృతి

ప్రజాశక్తి - రామచంద్రాపురం (పాకాల)

మండలంలోని దామలచెరువు విజయ స్కూలు వ్యాను కింద పడి చిన్నారి సాత్విక (3) మృతిచెందిన సంఘటన శుక్రవారం ఉదయం మండలంలో చోటు చేసుకుంది. ఈ ఘటన పాకాల- ఐరాల మండలాల సరిహద్దులోని ఎగువ గుబలవారిపల్లి వద్ద జరిగింది. ఐరాల పోలీసులు సంఘటనా స్థలాన్ని చేరుకుని పరిశీలించారు. మృతిచెందిన కె.సాత్విక చిన్నారి వయస్సు మూడేళ్ళు. సాత్విక అక్కను బస్సు ఎక్కించడానికి అవ్వతో వచ్చింది. స్కూలు వ్యానును అక్కను ఎక్కించే హడావిడిలో అవ్వ చిన్నారిని గుర్తించలేదు. విజయ స్కూలు వ్యాను కిందకు వెళ్లడంతో గుర్తించని డ్రైవర్ చిన్నారి తలపై వ్యాను వెళ్లింది. బాలిక అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. స్కూలు వ్యాను వదిలి డ్రైవర్ పరారయ్యాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీడీనెల్లూరులో రోజుకో మలుపు..!

కొత్తగా నారమల్లి పద్మజ ఖరారు
'స్వామి'కి టికెట్ లేనట్లేనా..?

సిఎంతో నారమల్లి పద్మజ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, వెదురుకుప్పం

చిత్తూరు జిల్లా జీడీనెల్లూరు నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ప్రకటనలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి గందరగోళం నెలకొంది. జగన్ నిర్వహించిన సర్వేలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి గెలిచే అవకాశాలు తక్కువగా ఉన్నాయని సిట్టింగ్ ఎంపి రెడ్డెప్పకు తొలుత ఖరారు చేశారు. నారాయణస్వామికి అనుకూల వర్గం తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లి నారాయణస్వామికి ఇవ్వకపోయినా ఆయన కూతురు కృపాలక్ష్మికి ఇవ్వాలని పట్టుబట్టారు. అయితే ఆమె పేరుతో జరిపిన సర్వేలోనూ నూటికి పది శాతం మాత్రమే గెలుస్తుందని, 90శాతం ఓడిపోతుందని వచ్చింది. దీంతో చిత్తూరు ఎంపి రెడ్డెప్పకు సీటు ఖరారు చేస్తూ అధికారికంగా ప్రకటించారు. నారాయణస్వామిని చిత్తూరు ఎంపి అభ్యర్థిగా బదిలీ చేశారు. అయితే రెడ్డెప్ప తనకు జీడీనెల్లూరు వద్దని, సిట్టింగ్ స్థానమే ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ నేపథ్యంలో జీడీనెల్లూరు సొంత నియోజకవర్గమైన మాజీ ఎంపి శివప్రసాద్ సొంత చెల్లెలు నారమల్లి పద్మజకు పూతలపట్టు, జీడీనెల్లూరుల్లో ఏదో ఒకటి ఇవ్వాలని పట్టుబడుతున్నారు. తిరుపతి స్మార్ట్‌సిటీ ఛైర్మన్‌గానూ గతంలో ఉన్నారు. రెడ్డెప్ప, నారాయణస్వామి, కృపాలక్ష్మి సర్వేల్లో నారమల్లి పద్మజ బెటర్ అని తెలిసింది. ఈ నేపథ్యంలో నారమల్లి పద్మజకు జీడీనెల్లూరు సీటు ఖరారు చేస్తూ జగన్మోహన్‌రెడ్డి ప్రకటించనున్నట్లు సమాచారం. అయితే కళత్తూరు నారాయణస్వామి చిత్తూరు రెడ్డెప్పకు ఇచ్చినా, తిరుపతి ఎంపి సీటు కావాలని పట్టుబట్టారు. అయితే గురుమూర్తిని ప్రకటించామని, ఏమీ చేయలేమని తిరస్కరించినట్లు తెలుస్తోంది. పార్టీ అధికారంలోకి వస్తే ఎంఎల్‌సి ఇచ్చి మంత్రి పదవి ఇస్తానని అధినేత హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా జీడీ నెల్లూరు ఎంఎల్ఎ అభ్యర్థిని ప్రకటించడంలో తొలినుంచి గందరగోళం, అస్పష్టత నెలకొంది. నేదురుమల్లి పద్మజ 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ తన భర్త రెడ్డి సామాజికవర్గం, తన దళిత వర్గం అనుకూలంగా ఉంటాయని, గెలిచి తీరుతానని చెప్పారు.

వెంకటగిరి 'రాజా'ల మద్దతు ఎటు..?

వేమిరెడ్డికా.. తటస్థమా..

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

వెంకటగిరి నియోజకవర్గంలో పోటీచేసే అభ్యర్థులకు వెంకటగిరి సంస్థానానికి చెందిన రాజా కుటుంబీకుల మద్దతు ఉండాల్సిందే. మాజీ ఎంఎల్ఎ, ఎస్వీబీసీ ఛైర్మన్ సాయికృష్ణ యాచేంద్ర టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావుకు వీరాభిమాని. ఆయనపై ఉన్న అభిమానంతో 1983 నుంచి వెంకటగిరి నియోజకవర్గంలో ఎంఎల్‌ఎగా గెలుపొంది టిడిపిలో 2019 ఎలక్షన్ వరకూ ఉన్నారు. ఈ క్రమంలోనే అప్పటి టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి సామిరెడ్డితో చిన్నపాటి విభేధాలతో 2019 సార్వత్రిక ఎన్నికల సమరంలో ఎవరికి మద్దతు తెలపాలన్న తర్జన భర్జనలో టిడిపి నుంచి సామిరెడ్డి మద్దతు కోరినా నిరాకరించారు. అదే సమయంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రావడంతో ఆయన ప్రభావంతో రాజ కుటుంబీకుల అభిమానుల కోరిక మేరకు వైసిపిలో చేరారు. తాజాగా వైసిపిలో ఇమడలేక వేమిరెడ్డి, ఆయన సతీమణి టిడిపి వైపు చూడడంతో వెంకటగిరి రాజా వంశీకులు వైసిపి వైపే ఉంటారా? లేక వేమిరెడ్డిని అనుసరిస్తూ టిడిపికి మద్దతు ఇస్తారా? అన్నది చర్చనీయాంశంగా మారింది. వెంకటగిరి రాజా, మాజీ ఎంఎల్ఎ సాయికృష్ణ యాచేంద్రను పరామర్శ పేరుతో వైసిపి, టిడిపి నాయకులు పలు సందర్భాల్లో కలిసి ప్రసన్నం చేసుకోవడాన్ని నియోజకవర్గ ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. అయితే వెంకటగిరి రాజాల మద్దతు ఈసారి జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎవరి వైపు ఉంటుందో వేచి చూడాల్సిందే.

మహిళల అభివృద్ధే జగనన్న లక్ష్యం: పవిత్ర రెడ్డి

ప్రజాశక్తి- ఏర్పేడు : ఏర్పేడు మండలంలో ముసలి పేడు పంచాయతీలోని ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్ర రెడ్డి మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా మన జగనన్న ప్రతి సంక్షేమ పథకం మహిళల ఖాతాలోనే వేస్తున్నారు. అక్కా చెల్లెమ్మలకు ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల రుణాలు మాఫీ చేశారు. మహిళల రక్షణ కోసం దిశా చట్టాన్ని తీసుకొని వచ్చారు. మహిళల అభివృద్ధి కోసం పాటుపడిన జగనన్న ని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిషోర్ రెడ్డి, రమణయ్య యాదవ్, వైస్ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్, సర్పంచ్ నిర్మల, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఐ విజయ్ కుమార్ నాయక్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -చిన్నగొట్టిగల్లు: సత్యసాయి జిల్లా నుండి ఎలక్షన్ బదిలీల్లో భాగంగా భాకరాపేట ఎస్ఐగా విజయ్ కుమార్ నాయక్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. విధులను ఎలాంటి ఒత్తిడులకు లోను కాకుండా పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు.

ఘనంగా 'యువసంవాద్'

ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రధాన మంత్రి అందించిన పంచప్రాణ్ని యువత అర్థం చేసుకొని స్వీకరించే లక్ష్యంతో ఫిబ్రవరి 23న ఎన్ఎస్ఎస్ బ్యూరో ఆధ్వర్యంలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో యువసంవాద్ –ఇండియా ఏ2047 నిర్వహించారు. ఈ కార్యక్రమముఖ్య అతిథి వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ భారతి మాట్లాడుతూ ఈరోజు మన నిర్ణయాలే రేపటిని నిర్దేశిస్తాయన్నారు. దేశాన్ని పురోగతి, సమానత్వం, స్థిరత్వం వైపు నడిపించడం మన బాధ్యత అని, ప్రతికూల వాతావరణం సవాళ్లు ఉన్నప్పటికీ వాటిని అధిగమించే సత్తా, యువతకు ఉందని అన్నారు. గౌరవ అతిథి తుడ కార్యదర్శి, ఇన్చార్జి వైస్ ఛైర్పర్సన్, డాక్టర్ జి. వెంకటనారాయణ మాట్లాడుతూ అభివృద్ధి అనేది ఆర్థిక, విద్యాపరమైన వృద్ధిని మాత్రమే కాకుండా నైతిక పురోగతిని కూడా కలిగి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజనీ, సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ సుజాత, ఎన్ఎస్ఎస్ బ్యూరో కోఆర్డినేటర్ ప్రొఫెసర్ విద్యావతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టరు పి నీరజ, డాక్టర్ డి సుజాత, ఎన్ఎస్ఎస్ పీఓలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

ప్రజాశక్తి -తొట్టంబేడు: బాల్య వివాహాలను నిర్మూలిద్దామని ఐసిడిఎస్ సూపర్వైజర్ రేవతి పిలుపు నిచ్చారు. తొట్టంబేడు మండలంలోని పూడి గ్రామంలో శుక్రవారం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత అని అంగన్వాడీ కార్యకర్త సూపర్వైజర్లు తెలిపారు. .బాల్యంలో వివాహాలు చేయడం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ గ్రామంలో నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు ఎవరైనా చేసినా , ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాల్య వివాహ నిర్మూలనకు ప్రభుత్వం అనేక రకాల కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. బాలిక విద్యను ప్రోత్సహించడం ద్వారా బాల్య వివాహాలను అరికట్ట వచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు జె విజయ, వెంకటలక్ష్మి సహాయకురాలు రమణమ్మ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు .

వైసిపి పాలనలో ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు

చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ప్రచారం

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): గతంలో ఏ ప్రభుత్వం అందించనన్ని సంక్షేమ ఫలాలను వైసీపీ ప్రభుత్వం ప్రతి ఇంటికి అందజేసిందని, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి లు ఎన్నో మంచి కార్యక్రమాలు చేశారని, అలాంటి చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని గెలిపించాలని తొండవాడ ప్రజలను చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి కోరారు. చంద్రగిరి మండలం తొండవాడలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, జడ్పిటిసి యుగంధర్ రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ మల్లం చంద్రమౌళి రెడ్డి, వైస్ ఎంపీపీ నిరంజన్ కుమార్ రెడ్డి, పార్టీ కన్వీనర్ మస్తాన్, సర్పంచ్ మల్లం దీపిక రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు అధికారులు పాల్గొన్నారు.

రక్తహీనత తగ్గించడమే లక్ష్యం

ప్రజాశక్తి - బాలాయపల్లి : రక్తహీనత తగ్గించడమే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలని జిల్లా టాస్క్ ఫోర్స్ డిపిఎంఒ డాక్టర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గొట్టికాడు గ్రామ సచివాలయం పరిధిలో రక్తహీనత ఉన్న పిల్లలను గర్భవతులను గుర్తించి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గర్భవతులు రక్తహీనత వల్ల కాన్పు సమయంలో అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న గిరిజనుల గర్భవతులను గుర్తించి వారికి రక్తహీనత తగ్గే మాత్రలను పంపిణీ చేయాలని ఆదేశించారు. అనంతరం హెచ్ బి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి నాగేంద్ర కుమార్, డి పి హెచ్ ఎన్ ఓ బేబి రాణి, డిపిఓ ప్రకాష్, స్థానిక ప్రాథమిక ఆరోగ్య శాఖ అధికారి ప్రమీల సూపర్వైజర్ రాజేశ్వరి, ఎంఎల్ హెచ్ పి భాను, ఏ ఎన్ ఎంలు మునింద్ర, మేరి, మహిత, హెల్త్ అసిస్టెంట్ సుబ్బమ్మ, తపాలా మేరీ,కె.విజయ లక్ష్మీ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి -తొట్టంబేడు : విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని పలువురు పేర్కొన్నారు. మండలంలోని బోనుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు శుక్రవారం భరత్ యువసేన ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. విద్యార్థులకు పదవ తరగతి చాలా కీలకం అన్నారు. విద్యార్థులు తమ భవిష్యత్తును నిర్ణయించుకునేది ఇక్కడే అన్నారు. అందుకే ప్రతి విద్యార్థి ఉన్నత స్థానం చేరుకోవడానికి ఇక్కడే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. కలవగుంట భరత్ రెడ్డి చాలా కాలంగా విద్యార్థులకు అండగా నిలుస్తున్నారన్నారు. తొట్టంబేడు, శ్రీకాళహస్తి మండలాల్లో ఆయన నిత్యం సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోహర్, భరత్ యువసేన బోనుపల్లె సభ్యులు రాజా, జయప్రకాశ్, సోము, ప్రకాశ్, రాము, మోహన్, సుధీర్, మోతేష్, సురేష్ పాల్గొన్నారు.

టిడిపి నుండి వైసీపీలో చేరిక

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలంలోని పల్లం పంచాయతీకి చెందిన పల్లంపేట ఎస్సీ కాలనీలో టిడిపి నాయకులు వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి గెలుపును కోరుతూ ఎమ్మెల్సీ డాక్టర్. సిపాయి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సుమారు 100 మంది వైసిపిలో చేరారు. వైసిపిలో చేరిన వారిలో దాసరి ఈశ్వరయ్య, డి పండయ్య, డి వెంకటేష్, డి బాలాజీ, నాగరాజు అంకమ్మ మంగమ్మ, వసంత, రాజేశ్వరి, పి అనిల్, తదితరులు వున్నారు.

'రోటరీ క్లబ్ సేవలు విస్తృతం'

ప్రజాశక్తి -కోట : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అందించే సేవా కార్యక్రమాలను మరింత విస్తరిస్తామని రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ శ్యామ్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం రోటరీ క్లబ్ అంతర్జాతీయ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తిరుపతి జిల్లా కోట పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రూ.70 వేలు విలువైన స్కూల్ డెస్క్ లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ శ్యామ్ యాదవ్ హాజరయ్యారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయభాస్కర్ కు 8 స్కూల్ డెస్క్ లను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు షేక్ మొబీన్ బాష,షేక్. షంషుద్దీన్,తీగల సురేష్ బాబు,నెల్లూరు మోహన్ రెడ్డి,కోకోర్ల మధు యాదవ్, అద్దంకి వంశీ,ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి వర్ధంతి

ప్రజాశక్తి -కోట : కోట మండలంలో నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి 30వ వర్ధంతి సందర్భంగా కోట పట్టణంలోని నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి అభిమానులు, పలు పార్టీల నాయకులు, కోట లోని శ్రీనివాసులు రెడ్డి విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గునుపూడి నందా పాల్గొన్నారు.

ఐక్యతతో హక్కులను సాధించుకుందాం: శంకరరావు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసిలందరం ఐక్యతతో ముందడుగు వేస్తూ బీసిల హక్కులను సాధించుకుందామని బీసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు పిలుపునిచ్చారు. బీసి సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు కల్లూరు నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో ఓ ప్రయివేటు ఫంక్షన్ హాలులో బీసి సంఘాల నాయకులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ పెత్తందారుల ఆధిపత్యంతో బీసిలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగలేకపోతున్నారన్నారు. రాజకీయాలక తీతంగా బీసిలందరిని ఒక్కతాటిపైకి తీసుకరావడానికి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటనలు చేస్తున్నానన్నారు.

అవకాశమిస్తే కాంగ్రెస్ నుంచి పోటీచేస్తా : శికామణి చెల్లదురై

ప్రజాశక్తి - సత్యవేడు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సత్యవేడు కాంగ్రెస్ ఎంఎల్ఏ అభ్యర్థిగా ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపుతానని కాంగ్రెస్ సీనియర్ నాయకులు శికామణి చెల్లదురై స్పష్టం చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు.

మాయా లేదు.. మర్మం లేదు..అంతా ఇంద్రజాలం!

- మూఢనమ్మకాల నుండి చైతన్యం తెస్తున్న ఎమ్ఎస్రెడ్డి ప్రదర్శనలు
- ప్రఖ్యాత మెజీషియన్ పిసి సర్కార్ చేతుల మీదుగా ప్రశంస
- ప్రపంచ మ్యాజిక్ దినోత్సవం సందర్భంగా...

ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎంఎస్రెడ్డి

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: గ్రామీణ ప్రాంతాల్లో ముసురుకున్న మూఢనమ్మకాల భరతం పట్టే విధంగా మారుమూల గ్రామాల్లో సైతం మెజీషియన్స్ ప్రదర్శనలివ్వడం, ఆధునిక విజ్ఞాన ప్రపంచ ప్రారంభానికి శుభ సూచకమని ప్రజలు చర్చించుకుంటున్నారు. కేవలం పట్టణాలకు, మహానగరాలకు పరిమితమైన ఇంద్రజాల ప్రదర్శనలు ప్రస్తుతం గ్రామాల్లో సైతం ప్రదర్శనలివ్వడంతో సత్ఫలితాలిస్తోంది. ఏవో నాలుగు మాటలు ఉచ్చరించి చేతిలో విభూదిని తెప్పించి దైవసంభూతులుగా తమకు తామే ప్రకటించుకుని అమాయక ప్రజలను మోసం చేస్తున్న దొంగస్వాములకు ఇంద్రజాలికుల ప్రదర్శనలు విరుగుడు మంత్రాలు అవుతున్నాయి. దొంగ స్వాములు ప్రదర్శించే మంత్రాలన్నీ జిమ్మిక్కులు మాత్రమేనని గుట్టు విప్పి చెప్పే వీరి మాటలను తిరుపతి జిల్లా సూళ్లూరుపేటకు చెందిన మెజీషియన్ ఎంఎస్రెడ్డి తమ మ్యాజిక్ ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు అర్థమయ్యేలా ప్రదర్శిస్తున్నారు. మాయలు, మంత్రాలు లేవని ట్రిక్కులు మాత్రమేనని ఆయన చెబుతున్నారు. అరచేతిలో అద్భుతాలు చూపించి అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. మూఢనమ్మకాలను పారదోలి ఉత్తమ మెజీషియన్గా పేరు సంపాదించుకున్నారు. ఇంద్రజాల మాయలోడని పిలువబడే సూళ్లూరుపేటకు చెందిన ఎంఎస్రెడ్డి ఇంద్రజాల తపనతోనే పయనిస్తున్నాడు. గాలి నుంచి విభూది సృష్టించడం, మంటలు నుండి పావురాళ్ల తీయడం, ఖాళీ బాక్సులో అమ్మాయిని మాయం చేయడం, ఏ ఆధారం లేకుండా గాల్లో మనిషిని పడుకోబెట్టడం, కొబ్బరికాయ నుంచి నీరుకు బదులు నెయ్యి తెప్పించడం, మూడు అడుగుల బారు కత్తిని కడుపులో గుచ్చుకోవడం, ఖాళీ చేతి గుడ్డల నుండి పావురాని సృష్టించడం, తల మీద మంట పెట్టి టీ కాయడం ఖాళీ పేపరునుంచి కూల్ డ్రింక్ బాటిల్ బయటకు తీయడం వంటి చిత్ర విచిత్రాలతో పాటు ప్రజల్లో నెలకొన్న మూఢ నమ్మకాలను తన మ్యాజిక్ ద్వారా చైతన్యవంతులు చేస్తున్నారు. సూళ్లూరుపేటలోనే కాకుండా రాష్ట్రంలో 1500కు పైగా ప్రదర్శనలు ఇచ్చి అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి, కొణిజేటి రోశయ్య, నారాచంద్రబాబు నాయుడు, ప్రముఖులు కవి రచయిత డాక్టర్ సి నారాయణరెడ్డి, డాక్టర్ సమరం, వడ్డే శోభనాదీశ్వరరావు, సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత సినీ నటులు అక్కినేని నాగేశ్వరరావు, నటుడు రాజేంద్రప్రసాద్, మంగళం పల్లి బాలమురళీకృష్ణలతో పాటు పలు ఇతర దేశస్తుల ప్రశంసలు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే జాతీయ పురస్కారాన్ని రెండు సార్లు అందుకున్న ఏకైక మెజీషియన్ ఎమ్మెస్ రెడ్డి ఆంధ్ర ప్రదేశ్ లోనే కాకుండా అటు తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణలలో కూడా అనేక సన్మాన సత్కారాలు పొందారు. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తిలో జన్మించి, 30 సంవత్సరాలుగా సూళ్లూరుపేటలో నివాసం ఉంటున్నాడు ఎంఎస్రెడ్డి 25 సంవత్సరాలుగా మ్యాజిక్ ప్రదర్శనలు ఇస్తున్నాడు. బివి పట్టాభిరామన్ ఏకలవ్య శిష్యుడిగా మ్యాజిక్ ట్రిక్కులు నేర్చుకున్నప్పటికీ ఇందులో మరింత పరిణతి చెందడానికి ఇక్కడ షార్ నుంచి మరో మెజీషియన్ సిఎం వేలు, రమణయ్య, వద్ద కొంతకాలం శిష్యరికం చేసి ఎన్నో మెళకువలు నేర్చుకున్నాడు. తెలంగాణ మెజీషియన్లు చొక్కాపి వెంకటరమణ, రఘుబాబు,ప్రదీప్ రంగ్ రేజ్, మెజీషియన్ అలీ,మర్రి రమేష్, క్రాంతి కర్,బోస్,బి.ఎన్.ఎస్. కుమార్, మెజీషియన్ల మ్యాజిక్ మెలుకువలతో ఎంతో మ్యాజిక్ విద్యను నేర్చుకున్నానని తెలిపారు. తనకు ప్రముఖ ఇంద్రజాలకులు డాక్టర్ వి పట్టాభి రామ్, పిసిసర్కార్ జూనియర్, జాదూగర్ ఆనంద్, ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత ముఖ్యమంత్రి వైయస్జగన్మోహన్ రెడ్డి, ప్రముఖ తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు రమణాచారి చేతుల మీదుగా అవార్డులు, రివార్డులు, సన్మానాలు, సత్కారాలు పొందా రు. ఢిల్లీ తెలుగు అకాడమీ వారిచే నేషనల్ అవార్డు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అప్పటి ముఖ్యమంత్రి వైయస్. రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా ఉగాది పురస్కారం, మద్రాస్ తెలుగు అకాడమీచే సమైక్య భారతి గౌరవ సత్కార్ ఉగాది పురస్కారం, హైదరాబాద్ వారిచే వెన్నెల పురస్కారం, విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బెస్ట్ మెజీషియన్ అవార్డు, రోటరీ ఇంటర్నేషనల్ క్లబ్ వారిచే క్రియేటివ్ మెజీషియన్ అవార్డు,మ్యాజిక్ తో పాటు రోటరీ క్లబ్ సభ్యునిగా ఎంతోమంది నిరుపేదలకు సహాయ సహకారాలు అందించిన ఘనత ఎమ్మెస్రెడ్డిది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే పక్షుల పండగలో అక్కడికి విచ్చేసిన సినీ తారలు, సాంస్కృతిక కార్యక్రమాలను ముందుండి నడిపించే విషయంలో ప్రముఖ పాత్ర వహించేవాడు. మెగాస్టార్ చిరంజీవి చేతులు మీదగా రక్తదాన అవగాహన పుస్తకాన్ని ప్రారంభించారు. రక్తదానం చేయడం అంటే ప్రాణదానం చేయడమని ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని తన మ్యాజిక్ ద్వారా ప్రదర్శించేవారన్నారు.

దళితుల సాగు భూమికి పట్టాలు ఇవ్వాలి: సిపిఎం

దళితుల భూములను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని కుక్కంబాకం రెవెన్యూ సర్వే నంబర్ 81లో 82 ఎకరాల 80 సెంట్లు ప్రభుత్వ భూమిలో దళితులకు పట్టాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, సత్యవేడు నియోజకవర్గ ఇన్చార్జ్ దాసరి జనార్దన్ డిమాండ్ చేశారు. కుక్కంబాకం దళితుల స్వాధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను సిపిఎం నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నంబర్ 81లో 82. 80 ఎకరాల ప్రభుత్వ భూమిని స్థానికేతరులు కొందరు అక్రమంగా వెబ్ల్యాండ్లో నమోదు చేసుకున్నారని, దీన్ని అడ్డం పెట్టుకొని ఆక్రమించుకునేందుకు, స్థానికేతరులు, అధికార పార్టీ నాయకులు దళితులపై దౌర్జన్యం చేసి ఆక్రమించుకోవాలని చూస్తున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి వెబ్ల్యాండ్లో నమోదైన పేర్లను తొలగించి, నమోదు చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకొని సాగులో ఉన్న దళితులకు పట్టాలు ఇవ్వాలని జనార్దన్ డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు స్పందించకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఎర్రజెండాలు నాటి దళితులకు పంచుతామని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నియోజక వర్గ నాయకులు రమేష్ , గాలిరావూరు నాగరాజు, మండల నాయకులు నలగిరి రమణయ్య, ధనంజయులు, యువజన సంఘం నాయకులు మురళి, గ్రామస్తులు జెకె రమణయ్య, దళితులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి అన్యాయం: జనసేన

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: వైసిపి ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులపై దాడులు రోజురోజుకి పెరిగిపోతున్నాయని, ఈ దాడులు అన్యాయమని జనసేన నాయకులు పేర్కొన్నారు. మండలంలోని దామల చెరువు జనసేన కార్యాలయంలో జనసేన జిల్లా కార్యదర్శి ఎం.నాజీర్ ఆధ్వర్యంలోపాకాల మండల అధ్యక్షుడు తలారి గురునాథ్ అధ్యక్షతన శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎం నాజీర్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులపై దాడి హేయమన్నారు. అవినీతి, అన్యాయాన్ని గొంతెత్తి ప్రశ్నిస్తే దాడులు చేయడం తగదన్నారు. ఆ పార్టీ అధ్యక్షుడు గురునాథ్ మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి జర్నలిస్ట్ లను ఇంటికి పిలిపించి బెదిరించడం అన్యాయమని దీన్ని ఖండిస్తున్నామన్నారు. పాకాల మండల ప్రధాన కార్యదర్శి రహ్మతుల్ల మాట్లాడుతూ జర్న లిస్టులపై దాడులు అరికట్టాలని కోరారు. ఈ సమావేశంలో పాకాల మండల జనసేన కార్యదర్శి షాజహాన్, మస్తాన్, కార్యాలయ ఇన్ఛార్జి మస్తాన్(డాన్) పాల్గొన్నారు.

అవగాహన లేని రాతలతో ప్రజలను భయపెట్టొద్దు: సీఐ

నాయుడుపేట సీఐ శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి -నాయుడుపేట: పూర్తి వివరాలు తెలుసుకోకుండా అవగాహన లేని రాతలు రాసి ప్రజల్ని భయాందోళనకు గురిచేయొద్దని నాయుడుపేట సీఐ వి శ్రీనివాసరెడ్డి అన్నారు. రెండు రోజుల క్రితం నాయుడుపేటలో జరిగిన రెండు దొంగతనాలపై పేరు గుర్తింపు సరైన అవగాహన లేని కొంత మంది విలేకరులు వాట్సాప్ గ్రూపులో ప్రచారం చేస్తున్న రాతలపై ఆయన ఇలా స్పందించారు. ఆ దొంగతనాలపై వారిని ' ప్రజాశక్తి' వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ నాయుడుపేట సెజ్ కంపెనీల కారణంగా ఇతర రాష్ట్రాల నుంచి అనేక మంది పనుల నిమిత్తం ఇక్కడ నివసిస్తు న్నారని అలా అనేక రాష్ట్రాల నుంచి వచ్చిన వారు అధిక సంఖ్యలో నివసిస్తున్నప్పుడు ఇలాంటివి జరిగే అవకాశం ఉందని వీటిని అరికట్టేందుకు పూర్తి స్థాయిలో నివారణ చర్యలు చేపడుతున్నామని ఈ దొంగతనాలపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి దొంగలను త్వరలోనే పట్టుకుంటామని ఆయన పేర్కొన్నారు. చోటుచేసుకున్న రెండు దొంగతనాలలో పోలీసులు ఉండటంతో కావాలని దొంగలు 'పోలీసులను టార్గెట్ చేస్తున్నారా?' అనే ప్రశ్నకు ఆయన వివరణ ఇస్తూ జరిగిన రెండు దొంగతనాలు పోలీసులవి కావడం దురదృష్టకరమన్నారు. ఇదేదో పోలీసులపై టార్గెట్తో లేక ఒక ప్లానింగ్ తో చేసింది కాదని అనుకోకుండా జరిగినవేనని పేర్కొన్నారు. కానీ కొంతమంది విలేకరులు పూర్తి వివరాలు తెలుసుకోకుండా సరైన అవగాహన లేకుండా వాళ్లేదో గుర్తింపు తెచ్చుకోవాలని అనవసర ప్రచారం చేస్తున్నారే తప్ప అందులో ఏమాత్రం నిజం లేదని పోలీస్ యంత్రాంగం పూర్తి స్థాయిలో పనిచేస్తోందని వీటిపై ప్రజలు భయాందోళనలు చెందవద్దని ఆయన భరోసా ఇచ్చారు. విలేకరులు వార్తలు రాసేటప్పుడు ఇలా అధికారులను సంప్రదించి పూర్తిగా తెలుసుకొని వార్తల రాస్తే బాగుంటుంది అని ఆయన హితవు పలికారు. ప్రభుత్వాధికారులు, మీడియా ప్రజల శ్రేయస్సుకోసమే పనిచేస్తున్నారని అధికారుల కన్నా ప్రజపై మీడియా ప్రభావం ఎక్కువ ఉంటుందన్నారు. అన్ని విధాల సరైన సమాచారం సేకరించి ఎక్కడ ఎలాంటి అవాంతరాలు తావివ్వకుండా వార్తలు రాయవలసిన బాధ్యత విలేకరులపై వుందని గుర్తు చేశారు.

విద్యార్థులు వ్యాపారవేత్తలుగా ఎదగాలి : ఎంఇఒ

ప్రశంసా పత్రాలు పొందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రజాశక్తి- రేణిగుంట: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం (ఇఎండిపి డిస్టిక్ ఎక్స్పో–2024 పోటీలు ఇఎండిపి జిల్లా మేనేజర్ అనిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీ ఇళ్లలో జిల్లాలోని పలు పాఠశాలల నుండి విద్యార్థులు తమ ప్రాజెక్టులతో హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారులు ఇందిరా దేవి రంగనాథయ్య హాజర య్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఇందిరాదేవి మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల ద్వారా సమాజంలోని సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. రంగనాథయ్య మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో వ్యాపార వేత్తలుగా కూడా ఎదిగి పలువురికి సహాయ పడాలన్నారు. ఇఎండిపి జిల్లా అధికారి అనిత మాట్లాడుతూ 166 ప్రాజెక్టుల్లో ఉత్తమమైన 15 ప్రాజెక్టులను ఎంపిక చేసి ఆ తరువాత రెండు ప్రాజెక్టు లను రాష్ట్ర స్థాయి పోటీలకు అనుమతి స్తామ న్నారు. ముగిం పు కార్యక్రమానికి హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ బి శేఖర్ మాట్లా డుతూ విద్యార్థులు ఇలాంటి వేదిక లను ఉపయోగించుకుని శాస్త్రవేత్త లుగా ఎదగాలని కోరారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్టులు

మొదటి స్థానం జెడ్పి గర్ల్స్ హైస్కూలు, తడ , పాఠశాల విద్యార్థులు మేఘన, షాలిని (9వ తరగతి) గైడ్ టీచర్ టి కరుణ శ్రీ సహకారంతో తయారుచేసిన హెర్బల్ బేస్డ్ ప్రొడక్ట్స్ షాంపూ, బాత్ పౌడర్ హెయిర్ ఆయిల్ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయని తెలిపారు.

మురుగునీటి కాలువల సమస్యకు పరిష్కారం

పోరాడిన బడి సుధాయాదవ్కు సన్మానం

సుధాయాదవ్ను సన్మానిస్తున్న ప్రజలు

ప్రజాశక్తి రామచంద్రాపురం (చంద్రగిరి) వెంకటం పేట మురుగు నీటి కాలువ సమస్య కోసం గత వారం నుంచి పోరాటం చేసిన రాష్ట్ర ఒబిసి ఫోరం కన్వీనర్ బడి సుధాయాదవ్ పోరాటం ఫలించడంతో గ్రామస్తులు బడి సుధా యాదవ్ను ఘనంగా సన్మానించారు. దళితుల ప్రధాన సమస్య అయినా మురికినీటి కాలువ నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేయడంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి రూ.40 లక్షలు నిధులు మంజూరు చేశారు. సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేసిన బడి సుధాయాదవ్ ను శుక్రవారం సన్మానించడానికి స్థానికులు ముందుకు రాగా వైసీపీ నేతలు అడ్డుకునే ప్రయత్నం చేయటంతో వైసీపీ సర్పంచ్ కు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తమ ఎమ్మెల్యే చొరవతోనే సమస్య పరిష్కారమైందని సర్పంచ్, వైసీపీ నేతలు వాదనలకు దిగారు. ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్నా ఎమ్మెల్యే ఎందుకు పట్టించుకోలేదని గ్రామస్తులు ఎదురు తిరిగారు. మా ఎమ్మెల్యే పెళ్లి కానుకలు, చీరలు, స్వీట్స్ పంచారు కదా ఏం చేయలేదని ఎలా అంటారన్న స్థానిక వైసీపీ నేతను కానుకలు ఎవరు అడిగారని వెంకటంపేట గ్రామస్తులు నిలదీశారు. మురికి కాలువ నీరు సజావుగా వెళ్లకుండా చెత్తాచెదారం చేరి ఆ నీరు భూగర్భ జలంలోకి ఇంకి తాగునీటి బోరింగ్ లోకి చేరటంతో కిడ్నీ సమస్యలతో ప్రాణాలు పోతుంటే ఎమ్మెల్యే ఏం చేస్తున్నారని స్థానికులు మండిపడ్డారు. సంఘటనా స్థలంకు పోలీసులు చేరుకొని ఇరుగ్రూపులను శాంతింప చేయటంతో గొడవ సద్దుమణిగింది. వెంకట పేట గ్రామస్తులకు మహాశివరాత్రి ఉత్సవాలకు బడి సుధా యాదవ్ రూ.20 వేలు విరాళం ప్రకటించారు. సమస్యలు పరిష్కరించడానికి ప్రజాప్రతినిధులు కానవసరం లేదని ప్రజాసంకల్పం ప్రజా బలం ఉంటే ఎలాంటి సమస్య అయినా అధికారుల తలలు వంచి పరిష్కరించుకోవచ్చని బడి తెలిపారు. ప్రజా సమస్యలపై తగ్గేదే లేదని ఎంతవరకైనా పోరాటం సాగించి పేదల పక్షాన నిలబడతానని బడి సుధా యాదవ్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమం లో బాదురు ఎల్లయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరికలు

టిడిపి నాయకులు బొజ్జల సుధీర్రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరిన నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి సర్పంచులు, మాజీ సర్పంచులు టిడిపిలో చేరారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి సమక్షంలో ఊరందూరులో వీరంతా టిడిపి కండువాలు కప్పుకున్నారు. తొట్టంబేడు మండలం పూడి పంచాయతీ సర్పంచి మునెమ్మ, మండల అధ్యక్షులు గాలి మురళి నాయుడు, మునిరాజా నాయుడు ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. ఆమెతో పాటు వసంత రావు, గణేష్, సిసింద్రీ, శ్రీను, రమణయ్య, కే. రమణయ్య, లలిత, చరణ్ కుమార్, కృష్ణయ్య, నాగరాజు, రాజయ్య టిడిపిలో చేరారు. ఏర్పేడు మండలం నుంచి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురువారెడ్డి, పొన్నారావు, ధనంజయనాయుడు, నాగ రాజునాయుడు ఆధ్వర్యం లో మాజీ సర్పంచి వెంకటముని, వెంకట్ రెడ్డి, ముని రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, వాసు, వెంకటేష్ యాదవ్, శివమ్మ యాదవ్, మునిరత్నం, కన్నయ్య శెట్టి, నగరత్నం శెట్టి, బాలాజీ యాదవ్, ప్రభాకర్ శెట్టి, లోకానదంశెట్టి ఆ పార్టీలో చేరారు.

వన్నెకుల క్షత్రియులతో బొజ్జల ఆత్మీయ సమావేశం



ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తి నియోజకవర్గం టిడిపి ఇన్ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి నివాసంలో శుక్రవారం శ్రీకాళహస్తి, ఏర్పేడు, రేణిగుంట మండలాల వన్నెకుల క్షత్రియులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన నియోజకవర్గంలో వన్నెకుల క్షత్రియులు సుమారు 35 వేల మంది ఉంటారని తెలిపారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి తప్పక అధికారం చేపడుతుందన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే వన్నెకుల క్షత్రియులకు ఒక ఎకరా స్థలం కేటాయించి కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని తెలిపారు. వారి పిల్లల చదువులకు, వైద్యానికి, పెళ్లిళ్లకు టిడిపి తప్పక సహాయం అందిస్తుందన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త పార్టీ విజయానికి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రెడ్డి వారి గురువారెడ్డి, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

రైలు కిందపడి లెక్చరర్ ఆత్మహత్య

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): ఆర్థిక లావాదేవీల కారణంగా మనస్థాపం చెంది ఓ ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్ గా పనిచేస్తున్న సంతోష్ శ్రీరామ్ శుక్రవారం తెల్లవారుజామున రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. తిరుపతి –చంద్రగిరి రైలు మార్గంలోని 94/ 21 –23 పోస్టుల మధ్య శ్రీనివాస మంగాపురం విద్యాస్ కళాశాలకు సమీపంలోఈ ఘటన జరిగింది. మృతుడు నారాయణ కళాశాల లో ఫిజిక్స్ లెక్చరర్ గా పనిచేస్తున్న సంతోష్ శ్రీరాం (28)గా పాకాల రైల్వే పోలీసులు గుర్తించారు. వెదురుకుప్పం మండలం బలిజపల్లికి చెందిన సంతోష్ శ్రీరాం బైరాగి పట్టెడలో నివాసం ఉంటూ నారాయణ కళాశాలలో విధులు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆర్థిక లావాదేవీల కారణంగా మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు వెల్లడించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు పాకాల రైల్వే పోలీసులు తెలిపారు.

విద్యార్థులే కూలీలు!

ఇసుకను మోస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పట్టణంలోని స్థానిక బెస్త వీధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాల లో చదువుతున్న విద్యార్థుల వద్ద ఉపాధ్యాయులు కూలి పని చేయిస్తున్నారు. తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు పంపిస్తే వాళ్ల చదివించకుండా వారి వద్ద గంపలిచ్చి కూలి పని చేయిస్తున్నారు. వారి పిల్లలను కార్పొరేట్ పాఠశాలలో చదివించి పేద విద్యార్థులను కూలి పని చేయిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి కూలి పలు చేయిస్తున్న ఉపాధ్యాయులపై చర్య తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

మందకృష్ణ మాదిగ సభకు తరలిరండి: ఎంఆర్పిఎస్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా ఈ నెల 27న తిరుపతి వేదికగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సభకు మాదిగలు తరలిరావాలని ఆ సంఘం శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్ఛార్జి ఇర్ల రాజా మాదిగ పిలుపు నిచ్చారు. మందకృష్ణ మాదిగ సభ విజయవంతం పై పట్టణంలో ఎంఆర్పిఎస్ నాయకులు శుక్రవారం సమావేశమయ్యారు. ఎస్సీ కుల వర్గీకరణ సాధనకు మందకృష్ణ మాదిగ చేస్తున్న కృషిని ఈర్ల రాజా వివరించారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా సభను జయప్రదం చేసేందుకు మాదిగలు పెద్ద ఎత్తున తిరుపతికి తరలి రావాలని కోరారు. ఎంఆర్పిఎస్ నాయకులు మధు మాదిగ, చంద్ర మాదిగ, ఈశ్వర్ మాదిగ, యతేష్ మాదిగ, పాలూరి వెంకట ముని మాదిగ, బాలరాజు, మునిరత్నంమాదిగ పాల్గొన్నారు.

టిడిపి నుండి వైసీపీలో చేరిక

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలంలోని పల్లం పంచాయతీకి చెందిన పల్లంపేట ఎస్సీ కాలనీలో టిడిపి నాయకులు వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి గెలుపును కోరుతూ ఎమ్మెల్సీ డాక్టర్. సిపాయి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సుమారు 100 మంది వైసిపిలో చేరారు. మధు సూదన్రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. వైసిపిలో చేరిన వారిలో దాసరి ఈశ్వరయ్య, డి పండయ్య, డి వెంకటేష్, డి బాలాజీ, నాగరాజు అంకమ్మ మంగమ్మ, వసంత, రాజేశ్వరి, పి అనిల్, తదితరులు వున్నారు.

ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణ పరిధిలోని శ్రీ శక్తి భవనంలో జేయంఎల్బిసి లీడ్ బ్యాంకు మేనేజర్ రాజేంద్ర సుభాష్ ఆధ్వర్యంలో శుక్రవారం సమీక్షించారు. ఈ సమావేశంలో వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల్లోని బ్యాంక్ మేనేజర్లు, వైయస్సార్ క్రాంతి పదం, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి లీడ్ బ్యాంకు మేనేజర్ రాజేంద్ర సుభాష్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై , పొదుపు సంఘాల మహిళలు అభివృద్ధికి మనం కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ముద్ర లోన్లు, జగనన్న తోడు లోన్లను లబ్ధిదారులకు ఇవ్వాలని బ్యాంకర్లకు తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో డిఆర్డిఏ జిల్లా అధికారి సుబ్బారెడ్డి, మెప్మా బ్యాంకింగ్ అధికారి బాబా,తిట్కో గృహాల లోన్లు అధికారి వెంకటరమణ, యూనియన్ బ్యాంక్ మేనేజర్ సౌజన్య ఎంఏఓ విజయలక్ష్మి, అన్ని బ్యాంక్ మేనేజర్లు, మెప్మా, డిఆర్డిఏ సిబ్బంది పాల్గొన్నారు.

కామిశెట్టి గోదాలక్ష్మికి డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని హోమ్ సైన్స్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి కె. గోదాలక్ష్మికి డాక్టరేట్ను ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి మూడే దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. గృహ విజ్ఞానశాస్త్ర విభాగానికి చెందిన సీనియర్ ఆచార్యులు ఆచార్య కే. అనురాధ పర్యవేక్షణలో " అప్రైజ్మెంట్ ఆఫ్ ఎక్సిస్టింగ్ ఫ్రీస్కూల్స్ ఇన్ టర్మ్స్ క్వాలిటీ స్టాండర్డ్స్ " అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు ఆయన వెల్లడించారు. ఇందుకు గోదాలక్ష్మికి డాక్టరేట్ అవార్డును ప్రదానం చేసినట్లు వివరించారు. ఆమె పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్ లలో అనేక పరిశోధనా పత్రాలను ప్రచురించినట్లు తెలిపారు. తిరుపతి వాస్తవ్యులు కామిశెట్టి శ్రీనివాసులు కుమార్తె కామిశెట్టి గోదాలక్ష్మికి డాక్టరేట్ డిగ్రీ అవార్డు రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS :: TIRUPATI
ARC No.6/2023

Between:
M/s Dhanalakshmi Srinivasan Chit Funds (Andhra) Pvt. Ltd., Tirupathi Rep. by its Manager / Foreman ... Disputant
Vs.
K.Mahalakshmi & Others ...Opponents
Opponent No.1: K.Mahalakshmi, W/o. G. Sunil Kumar, Nandavanam, SVP Colony, Opp. Goshala, Tiruchanur, Tirupati-517503
Please take notice that the above dispute is posted to 06.04.2024 for your appearance before the said Hon'ble Deputy Registrar of Chits, O/o. District Registrar, Opp. TUDA Office Tirupati at 10.30 am either in person or through an advocate and raise your objections if any, failing which the case will be decided in your absence as exparte.
Hg. Date: 06-04-2024
S.HARI PRASAD, B.A., LL.B.,
Advocate, Tirupati

శ్రీకాళహస్తి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో
O.S.NO. 160/2022
బ్యాంక్ ఆఫ్ బరోడా శ్రీకాళహస్తి బ్రాంచి ...వాది
Vs
శ్రీ సాయి కృపా ఎంటర్ ప్రైజెస్, Rep.by Its Prop. యం.శ్రీ హరిబాబు మరియు ఇరువురు ...ప్రతివాదులు
TO
D-1: మల్లిని శ్రీ హరిబాబు S/o వెంకొబారావు
D-2: మల్లిని సరోజ W/o వెంకొబారావు, డోర్నెం. 1-1907,కొత్తపల్లి,శ్రీకాళహస్తి టౌన్
D-3: యస్.కళ్యాణి W/o వెంకటాచలం డోర్ నెం. 16-800 శ్రీనివాస్ నగర్, శ్రీకాళహస్తి టౌన్
ప్రతివాదులకు సమన్లు
వాది బ్యాంక్ ఆఫ్ బరోడా శ్రీకాళహస్తి బ్రాంచి ప్రతివాదుల మీద రూ.524533.00 బాకీ [illegible] 26.02.2024 తేదీన ఉదయం 10:30 గంటలకు [illegible]
ఇట్లు
కాయం సుధాకర్ రెడ్డి
అడ్వకేట్, శ్రీకాళహస్తి